# కన్నీటి బరువు

## జీవనప్రభాత

ఆమె స్మృతి నన్ను గాఢంలో ముంచింది. నిట్ట మధ్యాహ్నమే సూర్యాస్తమయం. ఉరకలూ పరుగులతో ముంచుకు వస్తున్న యేరు ఒక్కసారి ఇంకిపోయినట్లయింది నా బ్రతుకు.

నాకున్నదే ఆమె ఒక్కతె. ఆమెతోనే అన్ని దిక్కులూ నాకు నమసి పోయాయి. గుండెలు పగిలిపోయేలాగ ఏడ్చి యేడ్చి దినాలు గడుపుతున్నాను....

ఆమెను దహన పరచిన స్మశానాన దివారాత్రాలు పడికాపులు కాచేను; ఆమె నడయాడిన స్థలాలు పుణ్యక్షేత్రాలుగా పరిగణించి యుగాలు గడిపేను.—

ఆమె వస్తుందేమోనని; ఆమె ఛాయ అయినా వచ్చి నిలుస్తుందేమోనని; పరామర్శించి నన్ను—నాతో కలసి తిరుగుతుందేమోనని!

—ఆవిధంగా తిండికి నిద్రకు, ఉద్యోగానికి మిత్రులకు, దూరమయ్యాను.

పారిపోతున్నాను— సాటి మనుష్యుల సన్నిధినుండి భయపడి; వారి దృష్టులు సహించలేక, ఒక విపరీత కృత్యం ఏదో ఆచరించినట్లు!

ఒక దోషిగా — ఒక అపరాధిగా— తప్పించుకు తలవంచుకుని తిరుగుతున్నాను.—

వీధి వీధుల, వాడల, గోదావరిగట్ల మలుపుల, పొలిమేరల పొలాల వెంబడి, దూరాల శీతల తరుఛాయల —తిరుగుతున్నాను.

ఆమె వెళ్ళడంకాదు — నన్ను మృతప్రాయుణ్ణి చేసింది.

ఆమె లేని ఈ ప్రపంచమెందుకు ? ఈ కర్కశ మానవులతో ... ఈ గుట్టలతో గట్టులతో ...ఈ గోదావరితో... సాంధ్య సువర్ణిత కాంతుల మందమలయ పవనోర్మికా డోలికలతో ...ఏమి పని నాకు!

*  *  *

నేను నా వ్యావృత్తిలోపడి నలిగిపోతూ విరిగిపోయి నడచి పోతున్నాను. నాకళ్లకు "బాబు" విగ్రహం కనపడింది. చూడలేక వాడిని, తలవంచుకుని, ప్రక్క వీధిలోకి తిరిగి పెడుతున్నాను.

వెనక్కాలే వచ్చి నా రెక్క పట్టుకున్నాడు: తల రెండో వేపే పెట్టుకున్నాను.

"నీ...కో...స...o..." అని మాటలు రింగు రింగు మంటున్నాయి.

బలవంతాన నన్ను రెండు చేతులతోనూ పొదివి పట్టుకున్నాడు.

"నీకోసం వూరంతా తిరుగుతున్నా—" అన్నాడు. "యెంతపని జరిగిందీ—"

నేన్నిలవడిపోయాను, గుడ్లు వప్పగించి.

"నిన్నెంత అన్యాయం చేసిపోయిందీ — అందర్నీ గంగలో ముంచి పోయిందే! ...కడుపుతో కూడా వుందిట? ఇంకా పిల్లా జల్లా పుట్టుకొస్తారు.— ఏగో అదీ ఇదీ అంటూ...రామరామ...!"

నాకళ్లు ప్రయాగా సంగమమయ్యాయి. చెవుల్లో రేగిన సుడిగాళ్లు నదీ కెరటాలను అంచెలంచెలమీద అంతస్థుల పైకెత్తి అగాధాలను సృష్టిస్తున్నాయి.

వాడు నడుస్తున్నాడు. వాడి అడుగుల్లో అడుగులు వేస్తున్నాను.

మైదానంలో ఒక చెట్టు కింద కూలపడ్డాం...

"చెల్లెమ్మ...ఎంత మంచిది! ఎంత చక్కనిది! ఏం మర్యాదా!!"

"........................"

"నన్నంతి దూరాన్నే చూస్తూ అంత మొహం చేసుకునేది. ఇద్దరం ఒక తల్లి బిడ్డలుగానే ఒకవేళ పుట్టివుండినా రమ్మన్నా రాని ఆప్యాయత..."

"......................"

"చేసే ప్రతి పనిలోనూ ఎంత నాజూకుతనం; ఎంత పనితనం—"

"...................."

"అటువంటి యిల్లాలు ఇక లేదు; ఒకలక్ష్మి! నిన్ను ఎందుకూ పనికిరాని దిక్కుమాలిన వాడినిచేసి — మా చిట్టి తల్లి — వెళ్ళిపోయింది."

వాడి నోటవస్తున్న ఒక్కొక్కమాటే నన్ను శూలాలతో పొడిచేస్తోంది. నేను వలవల లాడుతూ నేలపడి దొర్లి పోతున్నాను.

"చూస్తూండగా బంగారంలాటి కాపరం నట్టేట కలిసిపోయింది. నీ బతుకు..."

నిజం. ఆమె నా జీవితానికి ఛందస్సు—ప్రతిభ. ఆమె మళ్ళిన మరుక్షణంలోనే నా బంగారం బయలు పడింది.

బాబు ముఖంకేసి చూశాను. కందగడ్డలా గుంది...లోలోన కుమిలిపోతున్న అగ్ని పర్వతం. నాకంటేకూడా ఎంతో బాధ పడిపోతున్నాడు....

"యేం వొచ్చిందిరా ? యెలా వచ్చి పోయిందిరా ? ఒక్క కొద్దుముక్క నా రాసేవు కాకేంరా ? నా సొంత కడుపున పుట్టిన పిల్లే అనుకున్నా గద ! అక్కడ లక్ష్మీ ఒకతే గోల— తిండి కూడా మానేసింది. వాళ్ళిద్దరూ కలిసున్న నాళ్లు రోజులూ ఒక్క కంచంలోతిని ఒక్క మంచంమీద పడుకునేవారు గదరా !"

నాకు ఎగవూపిరి దిగవూపిరి అవుతోంది. కంటికి కట్టినట్టు నా మూడుసంవత్సరాల బతుకూ కనపడుతోంది... శరీరం మీద స్పృహ లేకుండా, ఇరుప్రక్కలా విస్తరించివున్న వాతావరణాన్నే మరచి, మమ్మల్నే మరచి, ఒకొక్కసారి తిండిని నిద్రను అన్నీ మరచి —ఏకశరీరలమూ ఏక హృదయులమూ అయి ఒకే గతిలో గడిపిన క్షణాలు...!

"ఆమె చితికి నువ్వెలాగ నిప్పంటించగలిగేవు? నీకు చేతులెలా గొచ్చాయిరా?"

ఇవి చేతులు కావు - యమకింకరుల కోరలు... నా ప్రణయమే చివర కామె ప్రళయమయ్యింది.

నా మీద నాకే అసహ్యం వేసుకొచ్చింది. ఎందుకు బతికున్నా?

చాలాసార్లు చద్దామనుకున్నానే కాని... పిరికి వెధవని...చాతకాని—

చద్దమ్మని ! నువ్వుకూడా చచ్చివుంటావు — లేక చావుబతుకుల మీదుంటావు— ఈ చేతులతోనే అయిందని పించాలిసొస్తుంది కాబోలు రా దేవుడా అనుకున్నాను...."

ఛీ—నా బతుకు. నిజమే. ఎంతో ప్రేమించాను; ఏం చెయ్యగలిగేను? పరలోకంలోనే కాకుండా ఇక జన్మజన్మలకీ కూడా కలిసుంటామని ఒప్పందాలు చేసుకున్నాము.

"అంతా అయిపోయింది—" అన్నాను, ఇక ఏడ్వలేక, ఊడుకుబోలు తనంతో— బయటి శూన్య ప్రపంచానికి, భూరిపెడు

ఎండిన కన్నీళ్లతో ఒక్క తర్పణం ధార పోశాను.

* * *

వాడేదో మాట్లాడుతూనే వున్నాడు. వింటున్నానో లేదో నాకు తెలియదు. అలాగలాగ చీకటి ముంచుకు వచ్చింది. వాడు నడుస్తున్నాడు కాబోలు. నేనూ కదులుతున్నాను.

నాకళ్లు చెమ్మ యెండిపోయింది. వళ్లంతా దిమ్మగావుంది. అదే మైకంలో ఏమీ సంబంధం లేని ప్రపంచంలో ఈదుకుంటూ పోతున్నాను.

"పద యింటికి పోదాం—"

ఏయిల్లు ? నాకిల్లేమిటి?

"సారె!! ఈ వారంరోజులూ గుమ్మం తొక్కలేదాయేం? నాకడుపు మాడి పోతోంది. రెండు రోజులైతిన్న మెతుకులు. ఈ హోటల్లోకి పోదాం పద.!!

"నువ్వు పోయి తిను—"

"ఏడిశావ్ లేరా—"

"......................"

"తిండీ నిద్రా ఇల్లూ అన్నీ వదిలేశావన్న మాట ?"

"..............."

"నీ మొహమే చెపుతోంది."

నాకు మహా కష్టమనిపించింది. "ఏం చెప్పమంటావురా—!" అన్నా దీనాతిదీనంగా.

"రెండు మెతుకులు కొరుకుదామంటే?"

నే దిగాలుపడి నిలుచుండి పోయాను. "ఈ మెతుకులోటి తక్కువా?"

"యాడవడానిక్కూడా శక్తుండొద్దూ ? పద. ఏదో కక్కూర్తి—"

"నాకివన్నీ అనవసరం... వొక్కటీన్నీ యిప్పుడూ తిన లేదు.—"

"నేనున్నాగా—?"

"..............."

"ఐతే యేమంటావ్?"

"నేనుండలేను, ఇలా బతకలేను. ఆత్మహత్య చేసుకుంటా—"

"ఛేఫ్— ఆప్రయత్నంలో వున్నవాడివి ఇన్నాళ్లెందు కూర్చున్నావ్ ? ఉపవాసాలతో మాడి మాడి ఛావటం చాలా కష్టం. సుఖమైన చావు కోరుకోవాలి ... అర్రె! కోపమొచ్చిందా?... ఊరిశిక్షంటే వెళ్ళిపోతావేమిట్రా?"

"..............."

"సరె కానియ్యి. ఏం చేస్తాం ? తినక తప్పుతుందా? బతక్క తప్పుతుందా? యెవరో ఒకరి కోసం!"

"ఇంక నాకెవరున్నారని?"

"నేలేనూ? నా పెళ్లాం లేదూ? నువ్ తిండి మానుకూచుంటే చెల్లెమ్మ చూస్తూ వూరుకుంటుందా? పద—"

"నే తినలేనబ్బాయ్—"

విస్తరిముందు బలవంతాన్ని కూర్చోపెట్టేడు.

పుర్తి పసుపు అనిపిస్తా డొక్కొక్కప్పుడు. గోపు జాతికి చెందినవాడు. ఉపన్యాసం దంచసాగేడు.—

"నువ్ తినకపోతే నేనూ తినను. నువ్ తిండి మానుకుంటేనూ, బికారి వెధవలాగ వీధులంటుకుని తిరుగుతుంటేనూ ఆవిడ ఆత్మకి శాంతి కలుగుతుందా ? గొల్లున ఏడవదూ ? మనం పువ్వుల్లో పెంచిన ఈ మొక్క నేలవాలి కుళ్లిపోతోందేమిరా అని వాపోవదూ... ఏదో కక్కూర్తిపడు ...ఇంక మాట్లాడకు. నిన్ను ఘోరంగా ఆమె ప్రేమించినందుకు ప్రాయశ్చిత్తమేమిటయ్యా అంటే ఆమె నుత్తరగతులు లేకుండా నీ అంతట నువ్వే చెయ్యడం............. అంతేనా?..."

"..........."

"అబ్బ తిండిలేకుండా ఒక్క నిమిషం నేనుండలేను సుమా. అసలు ... చచ్చి ఎవరి నుద్ధరిద్దామనిరా? సరే — చచ్చావయ్యా— నీ పెళ్లాన్నే కలుసుకోగలవనే నిర్ధారణ యెలాగ?... ఊఁ...రెండు మెతుకులు— లెఖ్ఖ రెండు...యోఁ-గో అలాగ —"

"నాకు సహించడం లేదు—"

"విస్తట్లోకి చెయ్యి పోనియ్యి. నువ్ తినకపోతే నేనూ మానేస్తాను. బ్రహ్మహత్యాదోషం కూడా పట్టుకుంటుంది. — ఆవిడ స్వర్గంలో ఓమూల యెదురు చూస్తూ కూచుంటే నిన్ను నరకందగ్గిర దిగపెట్టేసి పోతారు....కోపంవద్దురా—!"

"..........."

"లేచినట్టైతే నే చచ్చినట్టే! మావూళ్లో వున్న నీ చెల్లెల్ని చంపుకు తిన్నట్టే!"

ఒకవంక ఏడ్పింపు : ఒకవంక బుజ్జగింపు.

ఎంత సహిస్తే అంతే కానియ్యి. ఏదో పథ్యం పుచ్చుకున్నట్టు—"

ఏదో తినబోయాను. మొహం తిరుగుతోంది. గుండె దడ ప్రారంభమయ్యింది. నోరంతా వెగటుగానూ చేదుగానూ వుంది. అన్నం కంటికి కనపడడమే లేదు. అంతా చీకటి కమ్మినట్లయింది.

"ముందు ఇన్ని మంచినీళ్లుతాగు"

* * *

"పద—యింటికి—"

ఇల్లెక్కడుందో. నేనావేపే వెళ్లడం లేదు. "ఇక నన్ను వేధించకురా—"

ఒక రిక్షామీద నన్ను కూలవేసి ఇంటికి చేర్చి, మెల్లమెల్లగా మెట్లెక్కించేడు తనే తాళం తీశాడు. దీపం వేశాడు. నేమళ్లీ ప్రారంభించేను.

"నేనిక్కడ నుంచో లేవ్రా..."

"ఆమాట నిజమే ! మీవాళ్లు ఒకళ్లలా ఒకళ్ళయి ఇక్కడ గడిపేరు. ప్రతి వస్తువులోనూ... ఈ ఇంట అడుగడుగునా నా కామె కనపడుతుంది. అది తప్పదు. ఇల్లంటే మార్చెయ్యగలం గాని— వస్తువులన్నీ కొత్తవి కొనుక్కోలేము కదా!"

నే కూలబడిపోయాను.

వాడు మెల మెల్లగా ఇంటి సామానంతా సర్దసాగేడు. దుమ్మలు దులప సాగేడు. చీపురు తీసుకుని గది తుడిచి శుభ్రంచేశాడు. ఒక వంక ఎవేవో కబుర్లు చెప్పుకు పోతున్నాడు.

"సిగరెట్లింకా కాలుస్తున్నావా?"

"ఆమధ్య మానేశాగాని—"

"కర్మ మీ అత్తారు చేస్తున్నారా?"

"ఊఁ—"

"అమ్మాయితోటే నీకూవాళ్లకీ సంబంధం పోయింది. అంతేలే—"

"అక్కడికొచ్చెయ్యమన్నారు—"

"అవునులే...మీ పెద్దత్తగారి కూతురుండాలనుకుంటా—"

"బి యస్ సీ జూనియర్ చదువుతోంది. అంతా వొచ్చేరు.—"

"ప్రభాకరం ఇప్పుడెక్కడున్నాడు? ఈ వూర్నించి బదలీ అయిపోయిందనుకుంటా—"

"మరదల్నే పెళ్లి చేసుకున్నాడు — రెండు నెలలు కూడా తిరక్కుండానే!


శ్రీ వత్స వారి

స్కిన్ డెక్స్

దురదలకు, పుండ్లకు, చర్మవ్యాధులకు దివ్యాంజనము.

పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-80

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు-1

ఎలా మనస్సొప్పుతుందో! ఏపిల్లా పీనూ వుంటే అనుకోవచ్చు...."

"దానికేంలే— అలా యెన్ని జరగడం లేదు?"

"మూడో మరదల్నిచ్చి చేసేరు. పెద్ద పిల్ల లిద్దరికీ పెళ్ళిళ్ళయి పోయాయట. ఇద్దరికీ చాలా తేడావుంది కూడా—"

"దానికేంలే—అనేక కారణాల కొద్దీ అలాచేస్తారు...." అంటూ భార్యా భర్తల మధ్య వయస్సులో విపరీతపు తేడాలున్నా సుఖసంసారం చేస్తున్న డజను కేసులు ఏకరవు పెట్టేడు. ఇంతట్లోకే మాచిన్నప్పటి రోజులకు వెళ్ళిపోయాం.

కాలేజీ చదువులు— ఆడపిల్లలూ... మా కథావస్తువులయ్యారు.

ఒక్కొక్కసారి నాదృష్టి పరావర్తనం చెందుతోంది.

"ఆవిడ పేరేమిటి?"

"ఏవిడ?"

"నువ్వనడం లేదు—"

"వింటున్నా."

"నీమొహం...ఆవిడ—మని రూం కెదురుగా వుండేది—"

"పాపం! ఆవిడ చనిపోయింది. కూతురేమో అనుకునేవాళ్ళంకదూ చాలాకాలం ......" నాకు తెలియకుండానే నా ముఖంలో ఒక నవ్వు కనిపించబోయింది. తన ఈడుకి తగిన అత్తగారితోటే వుండేవాడు ఆయన.....ఆవిడ చనిపోయిందట. ఈ వూరు బదిలీ అయింది....చివరి రోజుల్లో మొగుడూ పెళ్లాలనిద్దర్నీ కలుసుకున్నా—"

* * *

బాబుని మరచి పోలేను. వాడునన్ను రక్షించేడు— దుఃఖం నుంచే కాదు, మృత్యువునుంచి కూడా.

ఆ మర్నాడే నన్ను వాళ్ళింటికి తీసుకుపోయి వారంరోజులు కడుపులో పెట్టుకున్నాడు. తిరిగి నన్ను నావూళ్లో దిగబెట్టేడు.

మెల్లమెల్లగా నేను నిత్య జీవితంలో ప్రవేశించాను. అన్ని సరదాలలోనూ కలగజేసుకుంటున్నాను. పనిలోకి వెడుతున్నాను. నారుగ్మతలు పోయాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకుంటున్నాను.

బాబు ప్రయాణమయ్యాను. గట్టి గుండె కలవాడు.

"నేవచ్చినపని సక్రమంగా నెరవేరింది. నీ దుఃఖాన్ని ఉపశమింపచేశాను. ...... కన్నీళ్లు తేలిక కావు ...... వల్లరాళ్లు ... పిసవుకుండ్లు........"

ఒకసారి ప్రవాహంలో పడిన మనిషి వలె నేను గమనవేగానికి పడి కొట్టుకు పోసాగేను. నాకు తెలియకుండానే అన్నీ జరిగిపోయాయి. బి. ఎస్. సి. అమ్మాయి చదువు చాలించి నా కాపరం నడుపుకు వెడుతోంది!

* * *

రెండు సంవత్సరాలు గడచి పోయాయి. ఒకరోజు బాబుదగ్గర్నించిఒక కార్డువచ్చింది.

నా కళ్లు, తల, ప్రపంచం...గిరగిర తిరగసాగేయి. మళ్లీ మళ్లీ చదువుకున్నా నా వుత్తరాన్ని. నమ్మలేకపోయాను. నమ్మకుండా ఉండలేకపోయాను. వాస్తవ జగత్తులో నాటిగా వచ్చిపడే విషయాలు ఇలాగే భ్రాంతి కలిగిస్తాయి.

"మహాలక్ష్మీ సమానురాలైన నా భార్య లక్ష్మీదేవి 10-2 1945 వ తేదీ రాత్రి 10-30 గంటలకు స్వగృహంలోనే స్వర్గస్తురాలయింది."

ఎన్నిసార్లు చదివితేమాత్రం ఆ ఉత్తరం ఒక పిడుగుపడిన చోటుని స్పష్టంగా చూపుతూ కూర్చుంది.

నా స్నేహితుడికి అటువంటి కష్టం ముంచుకువచ్చింది. ఏనాడో వాడన్న మాటలు నాకు గుర్తుకు వచ్చేయి. నే వెళ్ళి వాడిని రక్షించాలి. ఇది నావిధి కాబోలు!..

నే గుమ్మం ఎక్కేసరికి - ఎదురుగా బల్లదగ్గిర రాసుకుంటూ కనపడ్డాడు బాబు. ఇల్లంతా బంధువులతో కలకల్లాడుతూవుంది. కాని ఏదో మంచుపొగ క్రమ్ముకుని ఉన్నట్లు తోచకపోలేదు.

బాబు చాలా గంభీరంగా నే కనపడ్డాడు.

"వొచ్చేవా! సాయంత్రమే వొస్తా వనుకున్నా.. గోపిగా! సామాను లోపల పెట్టరా."

"ఎలాగ జరిగింది?"

"అంతా తోసుకొచ్చింది. జ్వరం. మూడురోజులు. ఏం కాంప్లికేషన్లు కూడా లేవు. మూసుకుపోయింది."

"ఊహుఁ. అని మాత్రం మూలిగేను.

వాడేమీ చెదరిపోయినట్లు కూడా కనపడలేదు. నేను బలహీనుడిని. గుండె దిట్టం లేనివాడిని. కూవాడి విషయం వేరు. వాడు మంచి వేదాంతి వ్యవహార దక్షుడు. కాలేజీ చదువు మినహా వాడు భావకవిత్వ మొకటే అబ్బింది. వాడు అటాగ కాదు: జీవితంలో బాగా దెబ్బలు తిన్నవాడు. పదిరకాల మనుష్యుల చిత్తవృత్తులను ఎరిగి మసలుకోనగల సమర్థుడు.


భార్య జబ్బును గురించి వాడు మాట్లాడుతోంటే ఏవిధమైన ఆవేదనా కనపడలేదు.

"దాని తల్లి - అక్క - తండ్రి అంతా వచ్చేరు. నా వేపు నెవ్వళ్లున్నారు కనక? మేనమామ అత్తా వచ్చేరు. మిగిలిన అందరు బంధువులకీ కూడా రాస్తున్నా. కర్మనాటికి అంతా దిగుతారు. నే వొక్కణ్ణి...అన్నీ ఎలాగ చూసుకుంటానో! ఏం యుక్తుకు తెంగుకు వీల్లేదు. నువ్వు కొంచెం ఇల్లంతా మేనేజ్ చెయ్యాలి.. "

నేనూ నా భార్యా ఎలాగుండేవారిమో అంతకు తీసిపోకుండానే బాబు తన భార్యతో ఉండేవాడు. పెళ్లికి పూర్వం కొంత అటూ ఇటూ అనుభవం సంపాదించుకున్నాడని మిత్రులలో వాడుకపడ్డాడు కూడా భార్య అంటే అపారమైన అనురాగం కలవాడే అని యెరుగుదును

—కాని, విధికి తలవొగ్గి, మరుమాటాడకుండా శిక్ష అనుభవిస్తున్నాడు. నేకొంచెం

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు
విక్టర్ హ్యూగో రచించిన
★ ఘంటారావం ★
నవలకు పుస్తకరూపంలో తెలుగు అనువాదం
అనువాదకులు సూరంపూడి సీతారామ్
వెల రు. 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకము
ఆంధ్రగ్రంథమాల,
మదరాసు-1.



చంద్రగ్రహణం (మహాబలిపురం)

ఫొటో: సి. గురుమూర్తి—మద్రాసు.

ఆశ్చర్యం పోయాను. వాడు ఏడవటం కాని, ఏడుపు మొగం పెట్టటం కాని, ఆఖరికి విచారించటంగాని నే చూడలేలేదు. వాడు నాకంటే ఎన్ని విధాల ఏమయిపోతాడో అని, అన్నింటికీ సిద్ధపడి వచ్చేను... వాడి కంటినీటి చుక్కైనా నే చివరికి చూడలేకపోయాను. మార్దవం వాడికి లేదు కాబోలు.

గట్టిగుండె అంటే నే నాడు అర్థం చేసుకు వచ్చింది.

కర్మ రోజులన్నీ సవ్యంగా జరిగిపోయాయి. అన్నిరకాల దానాలూ యథావిధిగా చేశాడు. భారీగా సంభావనలూ సంతర్పణాలూ జరిగించేడు. సుమారు ఒక వంద మంది బ్రాహ్మణోత్తం ఆఖరి రోజున పంక్తిని కూర్చుని "ఆశీర్వచనం" చేశారు. తిరిగి వివాహం చేసుకుని గృహస్థాశ్రమం సాగించవలసిందని ఏకగ్రీవంగా నివేదించుకున్నారు.

మరి అయిదారు రోజులు అక్కడే వుండి నేనుకూడా వెళ్ళిపోయాను.

* * *

ఆరు నెలలతర్వాత ఒక పెద్ద రిజిస్టర్ కవరు బాబువద్దనుంచి వచ్చింది:

"తమ్ముడూ! నేను నీకు చాలా విచారకరమైన సంగతులూ - నువ్వు జీవితంలో నమ్మలేనివీ - తెలియపరుస్తున్నాను...... నువ్వుకూడా వెళ్ళిపోయావు.

"ఆ రాక్షసిలాంటి ఇంట్లో నే నొక్కడిని. నౌకర్లు - కూలీలు - వీరంతా పనివేళ వచ్చి వెళ్ళేవారు. చివరికి, సాయంకాలమయ్యేసరికి నే నొక్కడినే మిగిలిపోయే వాడిని.

"నాకు తెలియని ఎన్ని వ్యవహారాల లోనో ఆమె ఇదివరకు కలగజేసుకునేది. అవన్నీ ఇప్పుడు నా నెత్తిమీద విరుచుకు పడిపోయాయి. అనుక్షణం ఆమెను గుర్తుకు తీసుకురాసాగేయి.

"ఇంక నాకు దిగులు ప్రారంభమయ్యింది. ఆ యిల్లంతా నా భార్యది. ఆమె ఛాయ సంచరిస్తున్నది. ఏ వస్తువు చూసినా - ఆమె నీడ!...

"రాను రాను రాత్రులు నాకు దుస్స్వప్న ప్రాయాలయినాయి.

"ఆమె ఉన్నంతకాలం నాకు వెలితి లేదు. ఇప్పు డిక అసహాయుణ్ణి. ఏడవటానికి ప్రయత్నించాను. నా వేదాంతం దుఃఖతిమిరానికి నన్ను దూరుని చేసింది. నాకు దుఃఖం అనే అదృష్టదేవత ప్రసన్నం కాలేదు.

"ఈ బ్రతుక్కు అవధి యేమిటో అర్థం కాలేదు.

"నేను రాను రాను అన్నిటికీ దూరమయ్యాను - సుఖానికి దుఃఖానికి! ఆకలిగాని అభిలాషగాని నాకు కేవలం ఛాయా మాత్రాలయ్యాయి. ఏంచేతనో...

"జీవితం చివరకు ఒక భీకరస్వప్నంగా మారింది. నా గుండె బరువెక్కి, అంతకంతకు భరించరానిదయింది. ఆ వేదన కరిగి కరిగి అశ్రువుల రూపంలో బయటికిపోవాలి. ఆ అదృష్టం నాకు లభ్యం కాలేదు.

"నీకు మళ్ళీ ఉత్తరం రాద్దామనుకున్నాను. పోనీ నీ దగ్గరకు చేరదామనుకున్నాను. అందువలన ఇక లాభంలేదనీ, ఇప్పటికే ఆలస్యమైపోయిందనీ, నా శరీరం శిథిలించిపోయిందనీ స్పష్టం చేసుకున్నాను.

"ఈ ఉత్తరంతో నావిల్లు పంపిస్తున్నాను. నిన్ను ధర్మకర్తగా నిర్ణయించేను. నా ఆశయాలన్నీ అనుబంధపరచిన బాధ్యతో నీమీద పెడుతున్నాను. నువ్వొక్కడివే నాకు ఆప్తుడివి.

"సౌఖ్యవంతమైన ఈజీవితాన్ని మోయలేక - నన్ను నేనే అంతం చేసుకుంటున్నాను......"

మా బాబు గుండెబరువును నేను కరిగించలేకపోయాను. నా చేతులారా వాణ్ణి చంపివేసినవాణ్ణయ్యాను. ★